

# ఏటి ఒడ్డున నీటిపూలు

## - కొలిపాక రమామణి



రమామణిగారు 29 యేళ్ళ వయసులో వ్రాసిన మొదటి నవల ఈ 'ఏటి ఒడ్డున నీటిపూలు'. పోటీల్లో బహుమతి గెలుచుకుంది. తర్వాత కన్నడపత్రికలో అనువాదమై సీరియల్ గా వచ్చింది. అప్పుడు పుస్తకరూపంలో వెలువడింది. ఆ తర్వాత నాలుగైదు సంవత్సరాల వ్యవధిలోనే 'వెన్నెల్లో పిల్లనగ్రోవి', 'గడ్డిపోచలు','హాలాహలంలో అమృతం' లాంటి పాఠకాదరణ పొందిన నవలలు వ్రాశారు. అప్పటి అన్ని ప్రముఖపత్రికలలోను, ఆకాశవాణికి కథలు కూడా వ్రాశారు.

(గత సంచిక తరువాయి)

ఆంధ్రప్రభ వారపత్రిక ఉగాది నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన నవల (1968)

**శాంతమ్మ** ఉదయం లేస్తూనే శంకరం పక్క ఖాళీగా ఉండటం చూసింది. 'వీడింత పెందరాళే ఎందుకు లేచాడు?' అనుకుంటూ పెరటిలోకి వెళ్ళింది. పెరటిలో లేడు. ఆవిడికి కొద్దిగా భయం వేసింది. భానుమతిని లేపి, "శంకరం ఎక్కడికి వెళ్ళాడు?" అంది.

భానుమతి ఆశ్చర్య పోయింది. "పెరట్లో ఉన్నాడేమోనమ్మా" అంటూ బయటికి వచ్చింది.

"పెరట్లో లేడమ్మా" అంది శాంతమ్మ భయాందోళనలతో, వీళ్ళ మాటలు వినిపించి చారుమతి, మాలతి లేచారు.

సంగతి విన్న చారుమతి గుండె ఒక్కసారి భయంతో కంపించింది. రాత్రి తను అవివేకంగా కోపంతో తిట్టిన తిట్లకి శంకరం మనస్సు చెదిరి ఆత్మహత్య లాంటిదేమీ చేసుకోలేదుకదా?

పైకి మాత్రం తల్లికి ధైర్యం చెప్పాలనే ఊహతో అంది. "ఎక్కడికి వెళతాడమ్మా? మునుపు ఒకసారి రాత్రి అంతా ఇక్కడో తిరిగి వచ్చాడు, జ్ఞాపకం లేదూ? ఇప్పుడూ అలాగే వస్తాడు. నువ్వేం గాభరా పడకు."

"అన్న పక్క మీద ఎఱ్ఱ దుప్పటీ ఏదమ్మా?' అంది మాలతి. అందరు అప్పుడే శంకరం పక్క గమనించారు. శంకరం పక్క మీద వేసిన ఎఱ్ఱ దుప్పటీ, కప్పుకునే గళ్ళ దుప్పటీ, దిండూ లేవు. పక్క దగ్గిరికి వెళ్ళిన మాలతీ ఒక చీటీ చూసింది. అందులో శంకరం ఉత్తరం రాసి పెట్టాడు.

"అమ్మకు,

నేను ఉద్యోగం కోసం వెళుతున్నాను. ఉద్యోగం దొరికితే గాని ఇంటికి రాను. మీరు ఏమీ కంగారు పడకండి.

శంకరం"

మాలతి ఉత్తరం తల్లి చేతికి ఇచ్చింది. ఉత్తరం చూసి భోరుమని ఏడ్చింది శాంతమ్మ. "నా బాబు ఎక్కడికి వెళ్ళాడో, ఎలా వెళ్ళాడో, ఎప్పుడు తిరిగి వస్తాడో?" అంటూ శోకాలు పెట్టింది. ఆవిడికి చారుమతి మీద కోపం కట్టలు తెంచుకు వచ్చింది.

"నీ వల్లే శంకరం ఇల్లు విడిచి వెళ్లి పోయాడు. ఎంతెంత మాటలన్నావు! మీ మాటలకే బాబు మనస్సు విరిగి వెళ్లి పోయాడు. నాలుగు రాళ్ళు సంపాదిస్తానని మరీ అంత పొగరా నీకు!"

"అబ్బ! ఊరుకో అమ్మా! నీకు తెలియకుండానే పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నావు. మాస్టారిని అడుగుదాం. ఉండు. ఆయన శంకరాన్ని తీసుకు వస్తారు" అంటూ ఓదార్చింది భానుమతి.

చారుమతి వెంటనే శంకరం రాసిన చీటీ తీసుకుని చుట్టూ తిరిగి రామారావుగారి గదికి వెళ్ళి, తలుపు కొట్టింది.

నిద్రపోతున్న రామారావుగారు, "మాస్టారూ" అన్న ఆడ గొంతుక విని, లేచి తలుపు తీసి చారుమతిని చూసి ఆశ్చర్యపోయారు.

చారుమతి నిద్ర లేచింది లేచినట్టే వచ్చేసింది. రేగిన జుత్తు, నిద్ర కళ్ళు.

"ఏమండీ? ఏం కావాలి?" అనారు రామారావుగారు.

"మా శంకరం ఈ చీటీ పెట్టి, ఇల్లు విడిచి వెళ్ళిపోయాడండీ" అంది చారుమతి చీటీ ఇస్తూ.

'అరెరే! ఇలా ఎందుకు చేశాడు?

చారుమతి ఏమి మాట్లాడలేదు.

"నిన్న రాత్రి పదిగంటలకి నా దగ్గిరికి వచ్చి ఇరవై రూపాయలు ఉంటే ఇమ్మన్నాడు. ఇంటికి అవసరమేమోనని ఇచ్చాను. ఇలా చేస్తాడని అనుకోలేదు" అన్నారు రామారావుగారు.

"అమ్మ చాల దిగులు పడుతూందండీ, శంకరం ఏమై పోతాడోనని." చారుమతి దిగులుగా చెప్పింది.

"అమ్మని దిగులు పడవద్దని చెప్పండి. శంకరం ఉద్యోగం కోసమై వెళ్ళి ఉంటాడు. అయినా నేను స్టేషన్ కీ, బస్ స్టాండుకీ వెళ్ళి చూస్తాను, ఎక్కడైనా ఉన్నాడేమో!"

రామారావుగారు బట్టలు మార్చుకుని చెప్పులు వేసుకు బయటికి వెళ్ళారు. చారుమతి ఆ సంగతి తమ ఇంటి భాగానికి వచ్చి తల్లితో చెప్పింది.

చారుమతి స్కూలుకి వెళ్ళలేదు. మాస్టారి కోసం ఎదురు చూస్తూ కూర్చున్నారు అంతా.

చారుమతి 'శంకరాన్ని ఎందుకు తిట్టానా' అని మథనపడింది. ఏదో తప్పు చేశానన్న భావం పీడిస్తూంది. భానుమతి దగ్గిరికి వెళ్ళి కూర్చుంది.

"భానక్కా! నేను చాలా తప్పు చేశాను కదూ? శంకరాన్ని అలాంటి మాట అనకుండా ఉండవలిసింది. అమ్మకి చాలా కష్టం కలిగించాను."

"నువ్వు అన్నదానిలో కూడా తప్పు లేదు చారూ!"

"ఏమో అక్కా! నిన్న శంకరాన్ని ఏదో కోపంలో అనేశాను. కాని ఇవ్వాళ బాధ పడుతున్నాను. డబ్బు ఇబ్బందులు నన్ను కఠినురాలిగా మార్చేస్తున్నాయి. నేను తెచ్చిన జీతంలో సగం మామ్మ మందులకే ఖర్చు అవుతూంది. ఆవిడ మందులు లేకపోతే మనం డబ్బుకి ఇంత ఇబ్బంది పడం."

"నువ్వేం బాధ పడకు. శంకరం ఉద్యోగం సంపాదించుకుని క్షేమంగా ఇంటికి వస్తాడు" అంది భానుమతి. నిన్న విన్న మాస్టారి కథే శంకరాన్ని ఈ పనికి ప్రోత్సహించిందని, శంకరం అభివృద్ధికి వస్తాడని నమ్మింది భానుమతి.

నిన్న జరిగిన సంగతులు ఏమీ తెలియని చారుమతి మాత్రం, 'అక్కకి ఎంత ధైర్యం! ఎంత నిశ్చింత!' అనుకుంది.

మధ్యాహ్నం పన్నెండు గంటలవుతూ ఉండగా రామారావుగారు వచ్చారు. ఆయన గది తలుపు చప్పుడు వినగానే చారుమతి, మాలతి బయటికి వచ్చారు.

"ఎక్కడా లేదండీ. నేను స్వయంగా స్టేషన్ కి, బస్ స్టాండుకీ వెళ్లి చూశాను. కాని మీరేం భయపడకండి. శంకరం తొందరలోనే వచ్చేస్తాడు" అన్నారు రామారావుగారు.

"ఆ మాట మీరే మా అమ్మతో వచ్చి చెప్పండి, మాస్టారూ. ధైర్యంగా ఉంటుంది ఆవిడికి. మా మాట కొట్టి పారేస్తూంది" అంది చారుమతి.

మాస్టారు అక్కచెల్లెళ్ళతో కూడా లోపలి ఇంట్లోకి వెళ్ళారు. శాంతమ్మ శోక దేవతలా వంటింటి గుమ్మంలో కూర్చుని ఉంది.

"అమ్మా! మీరు ధైర్యంగా ఉండండి. శంకరం మంచి ఉద్యోగం సంపాదించుకుని తొందరలోనే మీ దగ్గిరికి వస్తాడు. శంకరాన్ని గురించి మీరు బెంగ పెట్టుకోకండి. కుర్రవాడు బుద్ధిమంతుడు, తెలివైన వాడూను. పైకి వస్తాడు" అన్నారు రామారావుగారు.

తమ ఇంట్లో ఆరునెలలబట్టీ అద్దెకు ఉంటున్నా, ఆయనతో ముఖాముఖీగా మాట్లాడటం శాంతమ్మకి అదే ప్రధమం.

ఆత్మీయుడిలా వచ్చి ఆప్యాయంగా తనకి ధైర్య వచనాలు చెప్పగానే శాంతమ్మకి కొంచెం భయం తగ్గి, మనస్సు కుదుట పడింది.

ఆయన వెళ్ళగానే, "నాకే ఇలాటి తమ్ముడు కాస్త సుఖాలలో ఆదుకునే వాడుంటే, నా సంసారంలో ఇన్ని పాట్లు ఉండేవా!" అనుకుంది శాంతమ్మ. ఆ మాట గట్టిగానే అంది.

"అవును, ఇంత మంచి మామయ్య ఉంటే కొండంత ధైర్యం మనకి" అంది చారుమతి.

అప్పటిదాకా అపరిచితులుగా ఉండిన ఇంటివారికి, రామారావుగారికి మధ్య గోడ తొలగించినట్లయి పరిచయం ఏర్పడింది. ఇంటికి ఆయనే మగదిక్కు, స్నేహితుడు అయ్యారు. ఇంట్లో ఏ కష్టం, ఏ ఇబ్బంది కలిగినా శాంతమ్మ, "బాబూ" అంటూ, చారుమతి "మాస్టారూ" అంటూ రామారావుగారితో చెప్పి సలహా అడిగేవారు. మాలతి చనువుగా వెళ్లి మాస్టారి దగ్గిరినించి పత్రికలు, పుస్తకాలు తెచ్చుకునేది.

21

ఆ రోజు ఆదివారం. మధ్యాహ్నం పద్మ తన గదిలో కూర్చుని చదువుకుంటూ ఉంటే, మాధవరావు గది గుమ్మం దగ్గిరికి వచ్చి నిలబడ్డాడు. మొదటిసారిగా తన ఎదురుగా వచ్చి నిలుచున్నా భర్తను చూసి తడబాటుతో లేచి నిలుచుంది పద్మ.

"నా ఫ్రెండ్ వచ్చాడు. కాఫీ తీసుకురా. మంచి చీర కట్టుకుని మరీ రా" అని గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు మాధవరావు.

పద్మ ఆశ్చర్యపోయింది. "మంచి చీర కట్టుకురా" అని చెప్పాలా? తనకి తెలియదా!

కాఫీ కలుపుతూంటే ఎన్నో ఆలోచనలు వచ్చాయి. గులాబీరంగు పుల్వాయిల్ చీర కట్టుకుని, కాఫీ కప్పులు ట్రేలో పెట్టి మాధవరావు గదిలోకి వెళుతూంటే కాంతమ్మ కోడల్ని ఆశ్చర్యంగా, కోపంగా చూసింది.

"ఈవిడ నా భార్య, పద్మ" అని పరిచయం చేశాడు మాధవరావు, స్నేహితుడికి.

పద్మ నమస్కారం చేసి తలవంచుకుని బయటికి పోబోతూ ఉంటే, "చూడండమ్మా" అంటూ అతను ఆపాడు.

"మాధవుడు సగం పరిచయమే చేశాడు. నన్ను మీకు పరిచయం చెయ్యనే లేదు. నా పేరు మూర్తి. మేం ఇద్దరం చిన్నతనం నించి స్నేహితులం. మీరు కొంచెం కూర్చుంటే మా మాధవుడి చిన్నప్పటి కథలు చెబుతాను" అన్నాడు మూర్తి.

పద్మకి మూర్తి చనువుగా మాట్లాడటం ఎంతో సంతోషం కలిగించింది. కాని భర్తకి ఇష్టమో కాదో! పద్మ తటపటాయిస్తూ భర్త ముఖం వంక చూసింది.

"ఇంట్లో పని ఏమైనా ఉందా? మధ్యాహ్నం పనేం ఉంటుంది?" అన్నాడు మూర్తే తిరిగి.

"పనేం లేదు" అంది పద్మ మెల్లిగా.

"అయితే ఇకనేం! కూర్చోండి. మీరు మాధవుడి వంక చూడకండి. వాడి చిన్నతనం అంతా చెప్పేస్తానని వాడి భయం. మిమ్మల్ని కూచోనివ్వడు." మాధవరావు వీపుమీద ఒకటి చరుస్తూ, నవ్వుతూ అన్నాడు మూర్తి.

పద్మ పెదవుల మీద ఇన్నాళ్ళకి చిరునవ్వు మెరిసింది. అక్కడే కూర్చుంది.

"వీడమ్మా... మా మాధవుడు... చిన్నప్పటి నించీ 'అమ్మకూచి' అనుకో. ఎప్పుడూ అమ్మ కొంగు పట్టుకుని తిరిగే వాడు. టి.నగర్ లో మేం వీళ్ళ ఇంటి పక్క ఇంట్లోనే ఉండేవాళ్ళం. బడినించి ఇంటికి రాగానే మేం అంతా ఆడుకోడానికి గ్రౌండ్సుకి పరిగెత్తేవాళ్ళం. వీడు మాత్రం అమ్మకి ఎదురుగా కూర్చునే వాడు. దొంగతనంగా మా గాంగ్ అంతా సినిమాలకి చెక్కేసే వాళ్ళం. మీ ఆయన మాత్రం సత్య హరిశ్చంద్రుడనుకో. సినిమాలకి కూడా అమ్మతోనే వెళ్ళాలి అనేవాడు. 'అమ్మకూచి' , 'ఒంటిపిల్లి రాకాసి' అని ముద్దు పేర్లతో పిలిచేవాళ్ళం."

మూర్తి ఆగాడు. పద్మ వైపు తిరిగి నవ్వుతూ, "మీ ఆయన్ని వీడూ, వాడూ అంటున్నానని కోపగించుకోకమ్మా. మాధవుడు నాకు చిన్నప్పటినించీ తెలిసిన వాడే!" అన్నాడు.

"ఇంకా చాలు నీ చాడీలు. ఇందుకేనా మా ఇంటికి వస్తానని ప్రాణం తీసావు!" అన్నాడు మాధవరావు అసహనంతో.

"పోనీలే, నీ కథలు చెప్పనులే. వాడి గుట్టు ఎక్కడ బట్టబయలు చేస్తానేమోనని ఈ ప్రబుద్ధుడు భార్యని నాకు పరిచయం చెయ్యడానికి కూడా భయపడ్డాడు. నేను పోరితే తీసుకు వచ్చాడు. రేపు నేను మళ్ళీ వెళ్లిపోవాలి. పదండి, మాట్నీ షోకి వెళదాం. ఇంకా గంట టైముంది. అమ్మా! మీరు తయారుగానే ఉన్నారు కదూ! పదరా, మాధవా! నువ్వు బట్టలు వేసుకురా తొందరగా" అంటూ మాధవరావుని తొందర చేశాడు మూర్తి.

పద్మకి అయోమయంగా ఉంది. గుండెల్లో ఏదో భయం. భర్తతో కలిసి ఎప్పుడూ బయటికి వెళ్ళలేదు తను.

"ఇప్పుడు సినిమాలు ఎందుకురా? మంచి సినిమాలు ఏవీ లేవు" అన్నాడు కదలకుండా మాధవరావు.

"సినిమా చూడటం కాదురా ముఖ్యం. పాత స్నేహితుడితో కాసేపు సరదాగా గడపటం కావాలి. నువ్వు ముందర లేస్తావా లేదా! లేకపోతే మీ ఆవిడ దగ్గిర నీకు పరాభవం జరుగుతుంది" అంటూ మూర్తి మాధవరావు మెడపట్టి గెంటాడు. చేసేది లేక మాధవరావు బట్టలు తీసుకుని వేరే గదిలోకి వెళ్ళాడు.

అతను అలా వెళ్ళగానే మూర్తి అన్నాడు. "వీడెప్పుడూ యింతేనమ్మా. బయటికి కదలమంటే పెద్ద గొడవ చేస్తాడు. నిన్ను ఎప్పుడేనా సినిమాలకీ, బీచీకి తీసుకు వెళతాడా?"

పద్మ సమాధానంగా చిన్న నవ్వు నవ్వింది. అతను నువ్వూ, మీరూ అని కలగాపులగంగా సంబోధిస్తూ చనువుగా మాట్లాడుతూ ఉంటే, ఎవరో అన్నయ్యతో మాట్లాడుతున్నట్టు ఉంది.

"వీడు ఎక్కడికేనా తీసుకు వెళతాడని నాకేం నమ్మకం లేదు అమ్మా. నువ్వే మాధవుణ్ణి లేవగొట్టాలి. బలవంతపెట్టి, బయటికి ఈడ్చుకు వెళ్లి బయటి ప్రపంచంలో కూడా ఆనందం ఉందని చూపించాలి."

మూర్తి చెపుతూ ఉండగానే మాధవరావు వచ్చాడు.

పద్మ లోపలి వెళ్లి అత్తగారితో సినిమాకి వెళుతున్నట్టు చెప్పింది. ఆవిడ ఏమీ మాట్లాడలేదు.

టాక్సీలోనూ, సినిమా హాలులోనూ భర్త పక్క కూర్చున్నప్పుడు మనస్సు సంతోషంతో నిండి పోయింది పద్మకి. సినిమా మొదలు పెడుతున్నప్పుడు ఒక పంజాబీ అతను భార్య నడుం మీద చెయ్యి వేసి అతి జాగ్రత్తగా జనంలో నించి తప్పించుకుని తీసుకు రావడం చూసి, 'ఎంత అదృష్టవంతురాలు' అనుకుంది పద్మ. మాధవరావు మాత్రం భార్యని తగిలితే ఎక్కడ అపవిత్రం అయిపోతానో అన్నట్టు దూరంగా జరిగి కూర్చున్నాడు.

"పెళ్లి అయి రెండేళ్ళు దాటినా నీకు సిగ్గు పోలేదు మాధవా" అన్నాడు మూర్తి మెల్లిగా.

మౌనంగా ఉన్న భారాభార్తల్ని తన మాటలతో నవ్వించాడు మూర్తి. సినిమాలో లైట్లార్పి, న్యూస్ రీలు చూపిస్తూంటే మూర్తి మాధవరావుతో రహస్యంగా అంటున్న మాటలు పద్మకి వినిపించాయి.

"నీ భార్యని చూసిన మన స్నేహితులు చెప్పారు, 'ఆవిడ అప్సరస. చాలా అందంగా ఉంటుంది'అని. కానీ నేను నమ్మలేదు. వాళ్ళు అతిశయోక్తులు చెప్పలేదని ఇప్పుడు అనిపిస్తూంది."

మూర్తిని మధ్య దారిలోవదిలేసి పద్మ, మాధవరావు ఇంటికి వచ్చారు. లోపల తలుపు వేసి ఉంది. మాధవరావు తలుపు కొడితే కాంతమ్మ ఎంతకీ తలుపు తియ్యలేదు. "అమ్మా! తలుపు తియ్యి" అంటూ మాధవరావు గట్టిగా పిలిస్తే, పావుగంట గడిచాక వచ్చి కాంతమ్మ తలువు తీసింది.

అత్తగారిని చూసి ఆశ్చర్యపోయింది పద్మ. ఆవిడ కళ్ళు ఎఱ్ఱగా ఉబ్బి, కొన్నిగంటలుగా ఏడుస్తున్నట్టు ఉన్నాయి. చెదిరిన జుత్తుతో దెయ్యం పట్టిన మనిషిలా ఉంది. కోడల్ని చూస్తూనే ఆవిడ పూనకం పట్టినట్టు మాట్లాడింది.

"మహ అప్సరసని నేనే ఉన్నానంటూ టింగురంగామని మొగుడితో ఊరు తిరగడానికి బయలుదేరావే! లోకంలో నేనే అందగత్తెనని అనుకుంటున్నావా? ఏమిటా బోగం వేషాలూ, ఒళ్ళు కనిపించే చీరెలూనూ?"

పద్మని వీధిలోనే నిలబెట్టి మాటలు సాగించింది కాంతమ్మ. పద్మకి సిగ్గుతో, భయంతో నోట మాట రాలేదు. అప్పుడే చీకటి పడుతూంది. వీదిలో వచ్చే పోయే జనం ఎక్కువగా ఉన్నారు. 'ఈ గొడవ విని చుట్టుపక్కల అంతా చేరతారేమో?' అనుకుని అడ్డంగా నుంచున్న అత్తగారిని తప్పించుకుని లోపలికి వెళ్ళింది పద్మ.

"ఏమిటా మిడిసిపాటు! ఇంట్లో పెద్దముండ ఒకర్తి ఉందని జ్ఞానమేమైనా ఉందా? నా ఎదురుగా మొగుణ్ణి రాసుకుంటూ సినిమాలకి ఊరేగుతావా? మా రోజుల్లో మేం ఇవన్నీ ఎరుగుదుమా? నేను నీ కంటె లక్ష రెట్లు బాగుండేదాన్ని, తెలుసా?"

పద్మ తన గదిలోకి వెళ్ళిపోయి ఏం చెయ్యాలో తెలియక అలాగే గోడ నానుకుని నిలబడింది.

కాంతమ్మ హిస్టీరియా వచ్చిన మనిషిలా పిచ్చి పిచ్చిగా మాట్లాడుతూంది.

"అవును, సినిమాలకీ వెళతావు. షికార్లకి తిరుగుతావు. అన్ని సరదాలూ తీర్చడానికి నా కొడుకు ఉన్నాడుగా! పాతికేళ్ళు అష్టకష్టాలు పడుతూ పెంచాను. వాడికేమైనా విశ్వాసం ఉందా? ఇప్పుడు పెళ్ళాం కొంగు పట్టుకుని తిరుగుతాడు. నాకెవరున్నారు సరదాలు తీర్చడానికి, సరసం చెయ్యడానికి నాకెవరున్నారు? ఆ మహానుభావుడు మూడు నెలలు కాపరం చేసి, నన్ను బోడిముండని చేసి పోయాడు. తన దారి తను చూసుకున్నాడు. పదిహేనేళ్ళకే విధవరాలిని చేసేశారు అంతా!"

"అమ్మా! ఆ మాటలన్నీ ఇప్పుడు ఎందుకమ్మా? నీకు వచ్చిన కొరత ఏమిటి? ఊరుకో అమ్మా! నేనున్నాను నీకు. ఏడవకమ్మా" మాధవరావు తల్లి కళ్ళనీళ్ళు తుడుస్తూ ప్రాధేయపడుతున్నాడు."నాకెవరూ లేరు బాబూ! ఎవరూ లేరు. అందరూ నన్ను అన్యాయం చేసారురా. నిన్ను నా కడుపులో పడేసి తప్పుకున్నాడు మీ నాన్న. ఇన్నాళ్ళూ నా రక్తమంతా ధారపోసి పెంచితే, ఇప్పుడు నన్ను అన్యాయం చేస్తున్నావు నువ్వు నేను ఎవరికీ అక్కరలేదు!" వెక్కివెక్కి ఏడుస్తూంది కాంతమ్మ. మాధవరావు తల్లిని ఓదార్చాడు ఆవిడ కొడుకు భుజం మీద వాలిపోయి విపరీతంగా ఏడుస్తూంది. అరగంటకి కాని ఆవిడ ఏడుపు తగ్గు ముఖం పట్టలేదు.

పద్మ కొయ్యబొమ్మలా నుంచుని ఆశ్చర్యంగా చూస్తూంది. చిన్నపాపని బుజ్జగించినట్టు మాధవరావు తల్లిని ఓదారుస్తున్నాడు.

ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లినట్లు పడుకుంది కాంతమ్మ ఆ రోజు ఎవరూ భోజనం చెయ్యలేదు.

పద్మ పక్కమీద ఎంత దొర్లినా నిద్ర పట్టలేదు. "అమ్మకూచి", "అమ్మ కొంగు పట్టుకు తిరిగే వాడు" అంటూ భర్తని గురించి చెప్పిన మూర్తి మాటలు జ్ఞాపకానికి వస్తున్నాయి. దానికి తోడు అత్తగారి ప్రవర్తన, అత్తగారి మనస్తత్వం, భర్త మనస్తత్వం అర్థం కావడం లేదు. కోడలు ఒక్క రోజు కొడుకుతో సినిమాకి వెళితేనే చూసి సహించలేక పోతే, అత్తగారు కొడుక్కి పెళ్లి ఎందుకు చేసినట్టు?

పద్మకి హఠాత్తుగా ఏదో బోధ పడినట్టు అయింది. తల్లి ఎన్నిసార్లు శోభనం మాట ఎత్తినా అత్తగారు వాయిదాలు వేసింది ఎందుకో ఇప్పుడు తెలుస్తూంది. కానీ ఎన్నాళ్ళీ కాపరం? మద్రాసు వచ్చి ఏడాది పైన అయిపోయింది. బి.ఏ. మొదటి సంవత్సరం పాసై రెండవ సంవత్సరంలోకి వచ్చింది. తన జీవితంలో మాత్రం ఏ మార్పూ లేదు. భర్తకి తన ఎడల ఎటువంటి అభిప్రాయమో తెలియదు. భర్త ప్రేమకి నోచుకోలేదా? అందరికీ అందంగా కనిపించిన తను భర్తలో చలనం కలిగించ లేదా? జీవితమంతా అడివి కాచిన వెన్నెలేనా?

పెళ్లి అయి మూడేళ్ళయినా మనసారా ప్రేమగా "పద్మా!" అని ఒక్కసారీ పిలవని భర్త. తనని చూసి ఈర్ష్య పడి అసహ్యించుకునే అత్తగారు, తన సుఖం కోసం రాత్రింబవళ్ళు ఆదుర్దా పడే తలిదండ్రులు.. ఎవరికీ సంతోషం కలిగించాలని బ్రతుకుతుంది? తనవల్ల ఎవరికీ సుఖం లేదు. జీవించి సాదించేది ఏమిటి?

ఎక్కడైనా, ఎలాగైనా చచ్చిపోతే బాగుండును. కాని చావుని గురించిన ఆలోచనలు తల్లీ, తండ్రీ గుర్తుకు రాగానే ఆగిపోయాయి. ఆశలన్నీ తనమీదే నింపుకుని, ప్రేమంతా కుమ్మరించి, తన సుఖం కోసం అన్నీ త్యాగం చేసిన తల్లి, తండ్రి కూతురు ఆత్మహత్య చేసుకుందని వింటే ఎంత కుమిలి పోతారో! ఎంత కడుపు శోకం! కష్టమో, సుఖమో వాళ్ళకోసం ఈ లోకంలో తాను జీవించి ఉండాలి.

ఏం చెయ్యలేక, ఎటూ పాలుపోక అసహాయురాలిలా దిండులో తల దూర్చుకుని ఏడ్చింది పద్మ.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments